ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 । కనిష్ఠం 19.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025


ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు

- జిల్లాలో సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- పట్టభద్రులు 69.47 శాతం ఉపాధ్యాయులు 92.7 శాతం ఓటింగ్ నమోదు
- ఆసక్తి చూపని పట్టభద్రులు, పోటెత్తిన ఉపాధ్యాయులు
- కలెక్టర్ హామీతో ఓటు వేసిన భీంపూర్ మండల పట్టభద్రులు
- పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్
- పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు



సజావుగా పోలింగ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ నియోజక వర్గ స్థానానికి జిల్లాలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నెమ్మదిగా సాగిన ఓటింగ్ మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4గంటల వరకు పుంజుకుంది. దీంతో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 14935 ఉండగా 10375 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 69.47 శాతం పోలింగ్ నమోదయ్యింది. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 1593 కాగా, ఇందులో 1478ఓట్లు పోలయ్యాయి. దీంతో 92.78శాతం పోలింగ్ శాతం నమోదయ్యింది. ముఖ్యంగా ఓటు వేయడంలో పట్టభద్రులు వెనుకబడి పోయిన టీచర్లు మాత్రం ఓటేసేందుకు పోటెత్తారు. దీంతో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. పట్టభద్రుల పోలింగ్ శాతం భారీగా పడిపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా ఓటును నమోదు చేసుకున్న పట్టభద్రులు ఉత్సాహంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. అభ్యర్థులు ఓటర్లను తరలించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయక పోవడంతో ఓటు వేసేందుకు పట్టభద్రులు అంతగా ఆసక్తి చూపలేదు. కొన్ని మండలాల్లో మండల కేంద్రాలలోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో దూరభారంతో ఓటు వేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. అయితే ఉపాధ్యాయులు మాత్రం తమ సంఘాల వారిగా ఓటు వేసేందుకు పోటీపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కొన్నిచోట్ల ఓటర్లను తరలించిన పోలింగ్ కేంద్రాల వద్ద తమ అభ్యర్థులకు ఓటువేయాలని విజ్ఞప్తి చేయడం పోటాపోటీగా కనిపించింది. ఓటు వేయడంలో పట్టభద్రులు వెనుకబడడంతో అధికారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల్లో ఉన్న చైతన్యం పట్టబద్రుల్లో కనిపించ లేదని చెబున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధ్యాయుల ఓటింగ్ వేగంగానే ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.

బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ

పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలను దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటాపోటీ కనిపించింది. అధిష్ఠానం ఆదేశాలతో నియోజకవర్గస్థాయి నేతలు, ముఖ్య కార్యకర్తలు అప్రమత్తం అమయ్యారు. ఉదయమే పోలింగ్‌కేంద్రాలకు చేరుకుని తమ పార్టీ అభ్యర్థికి మద్దతునిలవాలని ఓటర్లను కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ సీరియల్ నెంబర్లను చూపుతూ పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అయితే పట్టభద్రులు మాత్రం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు ఓటువేసేందుకు అంతగా ఆసక్తి చూపినట్లు కనిపించడం లేదు. పోలింగ్ జరిగిన ప్రధాన పార్టీల అభ్యర్థులకు అంతంత మాత్రంగానే ఓట్లు పోలయినట్లు తెలుస్తోంది. జిల్లాలో బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థుల హవానే కనిపించింది. పట్టభద్రులు ముందుకు రాక పోవడంతో పోలింగ్ శాతం భారీగా పడిపోయింది. అయితే ఉపాధ్యాయులు మాత్రం సంఘాల వారీగా అభ్యర్థులకు మద్దతునిచ్చారు. దీంతో పోటాపోటీగా ఓటర్లను తరలించే పనిలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం వరకే టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 75శాతం పోలింగ్ పూర్తయ్యింది. కానీ పట్టభద్రుల స్థానానికి పోలింగ్ మాత్రం మందకోడిగానే సాగింది. దీన్ని బట్టి అభ్యర్థులపై పట్టభద్రులకు ఆసక్తి లేనట్లు కనిపించింది. దీంతో పోలింగ్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో పట్టభద్రుల పోలింగ్ శాతం భారీగా పడిపోవడం, ఉపాధ్యాయుల పోలింగ్ గణనీయంగా పెరిగింది. మొత్తం పట్టభద్రుల ఓటర్లు 14,935 కాగా, 10,375 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 4560 మంది ఓటర్లు ఎన్నికల పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అలాగే టీచర్స్ ఓటర్లు 1593 కాగా ఇందులో 1478 ఓట్లు పోలయ్యాయి. కేవలం 115 ఓట్లు మాత్రమే మిగిలాయి. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల పై ఉపాధ్యాయులు చూపినంత ఆసక్తి పట్టభద్రులు చూపించ లేక పోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎట్టకేలకు ఓటు వేసిన పట్టభద్రులు

రోడ్డు సమస్యను పరిష్కరించాలంటూ భీంపూర్ మండలానికి చెందిన ఓటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. వినూత్నంగా రోడ్డు సమస్యపై ఇదివరకు ప్రచురితమైన వార్త కథనాలతో బ్యానర్లను ఏర్పాటు చేసిరోడ్లపై ప్రదర్శించారు. అధికారులు దిగి వచ్చేంత వరకు ఎవరికి ఓటు వేసేది లేదని తేల్చి చెప్పడంతో అధికారులు తర్జనభర్జన పడ్డారు. అయితే కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఓటు వేసేందుకు ముందుకు వచ్చారు. ఎన్నోఏళ్లుగా రోడ్డును బాగు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వేడుకున్నా పట్టించుకోవడం లేదని పట్టభద్రుల జేఏసీ నాయకులు (తరువాయి 6వ పేజీలో..)


ఓటును బాక్సులో వేస్తూ..


ఓటేసిన ఆనందంలో..


ఓటర్లకు స్లిప్పులను అందిస్తున్న సిబ్బంది


పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్


ఓటు వేసేందుకు క్యూలో ఉన్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్: పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. గురువారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాలురలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి ఉన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లావ్యాప్తంగా 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి ఉదయం 8గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా జిల్లాలో 400 పోలీసులతో బందోబస్తును ఏర్పాటుచేశామని ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. గురువారం డైట్ కళాశాలలతోపాటు ఆయా పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఓటింగ్ జరుగుతున్న తీరుతోపాటు బందోబస్తును పరిశీలించారు. క్యూ లైన్‌తోపాటు పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు ఓటర్లు తప్ప ఇతరులను అనుమతించడం లేదన్నారు. అలాగే ఎన్నికల తర్వాత సెఫ్ మెటీరియల్‌ను సురక్షితంగా కరీంనగర్‌కు పంపిస్తామని తెలిపారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే

ఉట్నూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధానాన్ని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులతో మాట్లాడి ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు అనే ఆయుధాన్ని ప్రతీ పట్టభద్రుడు, ఉపాధ్యాయుడు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకొని, ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.


ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

త్వరలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి బసవేశ్వర్‌రావు

తలమడుగు, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం మంజూరుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి బసవేశ్వరరావు తెలిపారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. స్థలం విషయమై కలెక్టర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే స్థలం ఉన్న ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు మిగతా వారికి 5లక్షల మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ నజీర్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

ఉట్నూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రయ్య గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని హస్నాపూర్, నార్నూర్ మండలంలోని జాముడా ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి పరిసరాలు పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక మెను పరిశీలించారు. ఆయన వెంట ఏటీడీఓ క్రాంతికుమార్, ప్రధానోపాధ్యాయులు మంగులాల్‌నాయక్, డిప్యూటీ వార్డెన్ చోహాన్‌నెహ్రులు ఉన్నారు.

'బీజేపీ బలాన్ని చూడలేకే కార్యకర్తలపై లాఠీచార్జీ'


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ బలంగా ఉందని, దీన్ని జీర్ణించుకోలేని అధికార పార్టీ పోలీసులతో బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జీలు చేయి స్తోందని ఎమ్మెల్యే పాయలశంకర్ ఆరోపించారు. నస్పూర్‌లో బీజేపీ కార్యకర్త పోలీసుల లాఠీచార్జీ, గోదావరి ఖనిలో న్యాయవాదులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలుపు ఖా యమన్న విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం పోలీసులతో దాడులకు పాల్పడుతుందని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ ఎస్సై సుగుణకార్, గోదావరి ఖనిలో బీజేపీకి మద్దతు తెలుపుతున్న వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. డీజీపీ ఈ విషయంలో చర్యలు తీసుకుంటు అనుచితంగా వ్యవహరించిన పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

నేరడిగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్‌సింగ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సజన్, శివారెడ్డి, రవీందర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పండరి, ప్రతాప్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, సుజిల్, లక్ష్మణ్, శ్రీను, కరణ్‌సింగ్, శ్రీరామ్, రాజు, నాందేవ్, భావ్‌సింగ్, రహీం, సర్దార్, రాజేష్, పాండు, సురేష్, రాజు, ఖదీర్, మల్హారీ తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఆంధ్రజ్యోతి
కార్ అండ్ బైక్ రేస్



ఫిబ్రవరి నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు : ....
డోర్ నెంబరు : ....
వీధి పేరు : ....
గ్రామం / పట్టణం : ....
మండలం : ....
జిల్లా : ....
పోస్టల్ పిన్‌కోడ్ : ....
ఫోన్ నంబర్ : ....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది ఫిబ్రవరి నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి 2025 మార్చి నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి కార్యాలయం, గొల్లపల్లిరోడ్, గ్రా: ధర్మారం (బి),
మం: డిచ్‌పల్లి, జిల్లా : నిజామాబాద్ - 503 230
అసిస్టెంట్ మేనేజర్ (సర్క్యులేషన్) : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ : 99854 11451

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- విధులకు గైర్హాజరైన వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన కలెక్టర్ రాజర్షిషా


అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


మెడిసిన్ స్టోర్ రూమ్‌లో మెడిసిన్ వివరాలను అడిగి తెలుసు కుంటున్న కలెక్టర్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడిసిన్ స్టోర్ రూమ్, ఓపీతోపాటు ప్రసవాల గది, ప్రాథమిక పరీక్ష గది, ఈసీజీ గదులను, ఏఆర్‌యూ, ఏఎస్‌వీ, ఐటీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయా లేదా, ఐరెన్ పోలిక్ మాత్రలు పాఠశాలలలో ప్రతీవారం అందించాల్సి ఉంటుందని, విద్యార్థు లకు ఐరన్ పోలిక్ మాత్రలు ఇస్తున్నారా లేదా, తదితర వివరాలను డాక్టర్ పూజితను అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిష్టర్ చెక్ చేసి రిజిస్టర్‌లో సంతకం చేసిన ప్రకారం వైద్యులు, సిబ్బంది ఉన్నారా.. లేదా? పరిశీలించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌తోపాటు సీహెచ్‌ఓ సందీప్, పీహెచ్‌ఎన్ జ్యోతి, సూపర్ వైజర్ సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ పూజలకు ముందస్తు అనుమతి లేకుండా విధుల కు గైర్హాజరైన వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్యాధికారి నరేందర్‌ను ఆదేశించారు. అనంతరం అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్‌తో ఫోన్లో మాట్లాడుతూ విధులకు గైర్హాజరైన వారిపై ఆరాతీశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎల్లవేళలా వైద్య సిబ్బంది అం దుబాటులో ఉండాలని, విధులలో నిర్లక్ష్యం వ హిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్ప త్రిలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా స్టాక్ పూర్తికాకముందే ఇండెంట్ చేసి మందులను తెప్పించుకోవాలనీ, గర్భిణీల వివ రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. అనంతరం టాయిలెట్‌ను పరిశీలించగా శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు.



తాంసి గ్రామంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ

కేంద్రం నిధులతో గ్రామాల అభివృద్ధి: ఎంపీ

తాంసి, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా కృషిచేస్తానని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ అన్నారు. గురువారం మండలంలోని బండలనాగాపూర్, జామిడి, తాంసి తదితర గ్రామాలలో ఆయన పర్యటించారు. రైతు కుటుంబాలను కలిసి వివరాలు సేకరించారు. యువకులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో యువత తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. అభివృద్ధి కోసం ప్రతీఒక్కరు సహకరించాలని పార్టీలు, పట్టింపులకు పోవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తాటిపల్లి రాజు, నాయకులు నారాయణ, సదానందం, అరుణ్, దేవేందర్, తదితరులున్నారు.

● ఎండాకాలంలో మొక్కలు నాటడమేంటి?

తలమడుగు: ఎండతీవ్రత పెరుగుతున్న సమయంలో అటవీశాఖ అధికారులు రోడ్లపై మొక్కలు నాటడం ఏంటని అటవీశాఖ అధికారులపై ఎంపీ నగేష్ మండిపడ్డారు. గురువారం మండలంలో జరుగుతున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండల కేంద్రానికి వస్తుండగా మండలంలోని ఖోడాద్ గ్రామం నుంచి మండల కేంద్రం వరకు అటవీ అధికారులు మొక్కలు నాటుతుండగా వాటిని పరిశీలించారు. మండల కేంద్రానికి వచ్చిన ఎంపీ నగేష్ అటవీశాఖ జిల్లా అధికారులకు ఫోన్‌చేసి నాటుతున్న మొక్కలపై ఆరాతీశారు. ఒక మొక్క ఎండినా అధికారులే బాధ్యత వహించాలన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు బోనగిరి స్వామి స్టేట్ కౌన్సిల్ సభ్యులు గంగాధర్ రాజు, కనపర్తి చంద్రకాంత్, జక్కుల ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు నక్క ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులపై రౌడీ షీట్లు

ఆదిలాబాద్‌రూరల్, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో మంగళవారం తెల్లవారు జామునజరిగిన హత్యకేసులోని నిందితులైన ముగ్గురిపై రౌడీ షీట్లు ఓపెన్ చేసినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కొమ్మవార్ రవితేజ (26)ను గ్రూపు తగాదాల కారణంగా పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు.. గోవిందు, కార్తీక్, చెల్కల ప్రణీత్, దావుల సాయికిరణ్ హత్యచేసిన విషయం తెలిసిదే. నిందితులు ముగ్గురిని అదేరోజు అరెస్టు చేసి రిమాండ్‌కు సైతం తరలించారు. గోవింద్ కార్తీక్‌పై ఇది వరకే ఆరు కేసులుండగా, చెల్కల ప్రణీత్‌పై ఐదు కేసులు ఉండడంతో హత్య కేసు నిందితులందరిపై రౌడీ షీట్లు ఓపెన్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అంతేకాక ఈ కేసులతో సంబంధం ఉన్న మరో ఆరుగురిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో పాటు శారీరక శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. విద్యార్థినీలు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమాల్లో హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు వాణి, నిఖిత ప్రధానోపాధ్యాయుడు జి.అంబారావు, డి.భీంరావు, ఏఎన్ఎం అశ్విని తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

నేరడిగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ప్రధాన శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణ మహోత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించారు. రాజరాజేశ్వర శివాలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు చేశారు. కుంటాల జలపాతం వద్ద కొలువైన సోమేశ్వరుణ్ణి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.



శివాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు. శివపార్వతుల పల్లకీసేవ ఊరేగింపు పలు వీధుల గుండా సాగింది. మహిళలు హారతులు చేపట్టి దారి పొడవునా నీరు పోస్తు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మోహన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో..

బోథ్: మండల కేంద్రంలోని శివ భక్త మార్కండేయ ఆలయంలో గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు అన్ని వసతులను కల్పించారు. కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బీడీ ఫెడరేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ హాజరయ్యారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

తాంసి: మండలంలోని 400 ఏళ్ల పురాతన ఆలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. వడ్డాడి గ్రామంలో లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో గురువారం శివపార్వతుల కళ్యాణానికి నిర్వహించారు. ఈ జాతరను పురస్కరించుకొని వివిధ రకాల వెలసిన దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసేందుకు కోసం జనం బారులు తీరారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లానుంచి కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర, నిజామాబాద్, కరీంనగర్ నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్థులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. సాయంత్రం రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్రకార్యదర్శి గంగాధర్ హాజరయ్యారు. ఆయనను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అన్నదానానికి ఆయన చేయుతను అందించినట్లు స్థానికులు పేర్కొన్నారు.



లేఖర్‌వాడ వద్ద పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు : సీఐ

జైనథ్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జైనథ్, బేల, బీంపూర్ మండలాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్ అన్నారు. పెన్‌గంగా నది నుంచి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు గురువారం లేఖర్‌వాడ గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించగా మూడు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. వాటిని సీజ్‌చేసి జైనథ్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే ఇక నుంచి కఠిన చర్యలు తప్పవని సీఐ సాయినాథ్ తెలిపారు. కార్యక్రమంలో జైనథ్ ఏఎస్సైలు స్వామి, సిరాజ్‌లతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

కైలాష్‌ను అభినందించిన డీఈవో

ఆదిలాబాద్‌రూరల్, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): మన్‌కీబాత్‌లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కైలాష్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిని ప్రధాని మోదీ అభినందించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కైలాష్‌ను గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ప్రణీత శాలువాతో కైలాష్‌ను సత్కరించి అభినందించారు. గిరిజన భాషలు గోండు, కొలాం అభివృద్ధి కోసం ఏఐ (కృత్రిమ మేధ)ద్వారా అభివృద్ధి చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

బోథ్, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రం సమీపంలోని టీవీటీ ఎక్స్ రోడ్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ షేక్ ఇషాక్ (53) అనే వ్యక్తి ఆదిలాబాద్‌లో రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడు ఇషాక్ సోనాల గ్రామానికి చెందిన బొంపాల పోశెట్టితో కలిసి మోటార్ సైకిల్‌పై పొలంలోకి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుండి గుర్తుతెలియని బైకు బలంగా ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్సపొందుతూ ఇషాక్ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా ఉంచాలి

ఇచ్చోడ, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. గురువారం మండల పరిధిలోని అడేగామ(బి) గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ దస్త్రాలను పరిశీలించి అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు, సహాయకులకు సలహాలు ఇచ్చారు. సమయపాలన పాటిస్తూ కేంద్రాలన విధిగా తెరిచి నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, స్వప్న, అబిదాబేగం, రంజనా, బబితా, సునిత, సుమిత్ర, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శారద

సజావుగా పోలింగ్

(5వ పేజీ తరువాయి...)

వాపోయారు. కలెక్టర్ హామీ ఇవ్వడంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రత

జిల్లాలో ఏర్పాటు చేసిన 39 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.ఒకరోజు ముందే పోలింగ్ కేంద్రాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేకంగా 400 మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సజావుగా పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 4 గంటల తర్వాత బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి ప్రత్యేక వాహనాలలో గట్టి బందోబస్తు నడుమా తరలించారు. అక్కడక్కడ చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్న జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మాత్రం ప్రశాంతంగానే ముగిసిందని చెప్పవచ్చు.అయితే కొన్ని చోట్ల వసతులు సక్రమంగా లేక పోవడంతో ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వెంటనే సమస్యలను పరిష్కరించడంతో పోలింగ్ సజావుగా సాగింది.

● మండలంలో సజావుగా సాగిన ఎమ్మెల్సీ పోలింగ్

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా సాగింది. మండలం పరిధిలో ఉపాధ్యాయులు 48మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే గ్రాడ్యుయేట్ అభ్యర్థులు 371మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో మండలంలో 67.47 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ మండల కేంద్రంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం జాతర గ్రామంలో శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించుకునే క్రీడా పోటీలను ఎంపీ ప్రారంభించారు.

జైనథ్‌లో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

జైనథ్: మండలకేంద్రమైన జైనథ్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఇందులో పట్టభద్రులు ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం ఉపాధ్యాయులు పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించిన రెండు కేంద్రాలను నిర్వహించారు. ప్రతి కేంద్రానికి ఒక పీఓ ఒక ఏపీఓ ఇద్దరు ఓ పీఓలు ఇద్దరు మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు. ఇందులో జైనథ్ ఉమ్మడి మండలంలో గల పట్టభద్రులు 778 మందిలో 459 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతోపాటు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి సంబంధించి 44మంది ఉండగా 39మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలను జైనథ్ మండల తహసీల్దార్ ఆత్రం నారాయణ పరిశీలించగా జైనథ్‌రూరల్ సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

తాంసి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ ఎన్నికల ఓటింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. మొత్తం పట్టభద్రుల ఓట్లు 334 ఉండగా చివరికి 258 ఓట్లు పోలయ్యాయి. అలాగే ఉపాధ్యాయుల ఓట్లు 21ఉండగా 19మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మిగిలిన ఇద్దరూ ఓటు వేయడానికి రాలేకపోయారు.

సిరికొండలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

సిరికొండ: మండలంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో గ్యాడ్యుయేట్స్, ఉపాధ్యాయులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును నియోగించుకున్నారు. మండలంలో మొత్తం 97 మంది పట్టభద్రులు ఉండగా 77 మంది ఉపయోగించుకోగా 79 శాతం, ఉపాధ్యాయులు 10 మందిలో 9 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 90 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్సై శివరాం ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారాం, గణేష్, రాజేశ్వర్, ఎన్నికల అధికారులు, పోలింగ్ ఏజెంట్‌లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రంతో పాటు జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వివిధ రూట్‌లలో అధికారులకు భద్రతపై తగు సూచనలు చేశారు. నిర్మల్ పట్టణంతో పాటు దిలావర్‌పూర్, కుంటాల, భైంసా, ముథోల్, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలింగ్ నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నామని, ప్రతి ఒక్క టీమ్ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. సమన్వయంతో పని చేసి ఎన్నికల విధులు విజయవంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, అవినాష్ కుమార్, రాజేష్ మీనా, తదితర పోలీసు అధికారులు ఎస్పీ వెంట ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న

నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

మామడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్‌లో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం రోజున మామడ మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌లో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీహరి రావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మామడ మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌ను సందర్శించి వారికి పలు సూచనలు చేసి పట్టభద్రులు అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి, బాపయ్య, మాజీ ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సభ్యులు మహమ్మద్ రఫీ, మాజీ ఎంపీపీ జైసింగ్, వకీల్, అన్వర్, సంతోష్, నర్సారెడ్డి, సల్కం శేఖర్, సామ వికాస్ రెడ్డి, గ్రాడ్యుయేట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసిన మాజీ మంత్రి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అర్బన్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఓటర్లకు సహాయం చేసిన కాంగ్రెస్ నాయకులు

కడెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల దగ్గర గల పోలింగ్ కేంద్రం ఆవరణలో కాంగ్రెస్ నాయకులు పోలింగ్‌కు వచ్చే ఓటర్ల కోసం కౌంటర్ ఏర్పాటు చేసి వారికి అందుబాటులో ఉన్నారు. వారికి వివరాలు చెప్పి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సతీష్ రెడ్డి, వాజిద్ ఖాన్, ముడికే మల్లేష్, భూష్, వసిఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కుబీర్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 27 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం వరకు మందకోడిగా సాగింది. 2 గంటల తరువాత ఊపందుకుంది.

మందకొడిగా ప్రారంభమైన ఎమ్మెల్సీ పోలింగ్

ఉట్నూర్ డివిజన్‌లో టీచర్స్ ఎమ్మెల్సీకి 92.83శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీకి 69.83శాతం పోలింగ్



ఉట్నూర్‌లో పోలింగ్ కేంద్రంలో ఎస్పీ మహమ్మద్‌గౌస్,



ఉట్నూర్‌లో ఓటు వేసిన బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

ఉట్నూర్, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల, శాసనమండలికి గురువారం జరిగిన పోలింగ్ నెమ్మది నెమ్మదిగా ప్రశాంతంగా జరిగింది. ఓటర్లలో ఎలాంటి హడావిడి కనిపించక పోయినా రాజకీయ పార్టీలకు చెందిన కింది స్థాయి కార్యకర్తల్లో అతి ఉత్సాహం కలిగించింది. గత కొన్ని రోజులుగా తమ అభ్యర్థులను గెలిపించాలంటూ రాజకీయ పార్టీల నాయకులతో పాటు పలువురు అభిమానులు తమ అభ్యర్థుల పక్షాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం ఉదయం 8గంటల నుంచి ఉట్నూర్, గాదిగూడ, నార్నూర్, ఇంద్రవెల్లి మండల కేంద్రాలలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ సహాయ ఎన్నికల అధికారి యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి ఉపాధ్యాయుల కోసం, రెండు పట్టభద్రుల కోసం మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఉపాధ్యాయ పోలింగ్ బూతూలో 154 ఉపాధ్యాయ ఓటర్లకు గాను 10 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో కేవలం 16 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోగా, పట్టబద్రుల పోలింగ్ కేంద్రాలలో మొత్తం ఓటర్లు1215 ఉండగా మొదటి రెండు గంటల్లో 90 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గాదిగూడ మండల కేంద్రంలో ఒకే ఒక ఉపాధ్యాయుడు ఓటు హక్కు కలిగి ఉండడంతో ఆ పోలింగ్ కేంద్రంలో 10 గంటల వరకు కూడా ఆయన ఓటు వేయలేదు. మరో పట్టబద్రుల పోలింగ్ కేంద్రంలో 52 ఓటర్లకు గాను కేవలం నలుగురు ఓటు వేశారు. నార్నూర్ మండల కేంద్రంలో 64 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 9 మంది, 506 మంది పట్టభద్రులు ఉండగా 17 మంది, ఇంద్రవెల్లి మండలంలో 32 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా నలుగురు, 342 మంది పట్టభద్రులు ఉండగా 27 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు ఓటింగ్ సరళిని పరిశీలిస్తే ఉపాధ్యాయుల ఓట్లు11.55 శాతం, పట్టభద్రుల ఓట్లు 6.52 శాతం, మధ్యాహ్నం 12గంటల వరకు టీచర్స్ ఓటింగ్ శాతం 36.65 కాగా, పట్టభద్రుల ఓట్లు 18.82 శాతం నమోదు అయింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉపాధ్యాయుల ఓట్లు 76.89శాతం, పట్టభద్రుల ఓట్లు 43.69 శాతం నమోదు అయింది. పోలింగ్ ప్రక్రియ ముగిసే నాలుగు గంటల వరకు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ 92.83శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ 69.83శాతం పోల్ అయినట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలలో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియను జిల్లా పోలీసు సూపరింటెండ్ మహమ్మద్‌గౌస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తు గురించి డీఎస్పీ నాగేందర్, సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహర్‌లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్ వరకు ఓటర్లను ఫోన్లతో అనుమతించవద్దని ఆదేశించారు. ఎలాంటి అవకతవకలకు చోటు ఇవ్వకుండా జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్, ఆయన సతీమణి రాథోడ్‌కవిత, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రాథోడ్‌రితేష్, రాష్ట్ర నాయకులు కొమ్మురామచందర్, జిల్లా నాయకులు కైలాస్, రిటైర్డ్ ఈఈ రాథోడ్‌భీమ్‌రావు, ఐటీడీఏ ఏపీఓ పీవీటీజీ మేస్రం మనోహర్,రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు జాదవ్‌రవినాయక్, ఆయన సతీమణి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్య నిర్వహణ అధ్యక్షురాలు చౌహాన్‌శీతల్, యువకులు ముజీబ్, రాజేశ్, కపిల్‌నాయక్, అంజద్‌ఖాన్, ప్రజ్ఞశీల్‌లతో పాటు పలువురు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

నిరాశకు గురైన ఎస్జీటీలు

ఉట్నూర్ మండల కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలలో మేధావులు, పట్టభద్రులు, స్కూల్ అసిస్టెంట్లు ఓటు హక్కును వినియోగించుకోగా ఎన్నికల కమిషన్ సెంకడరీ గ్రేడ్ టీచర్లకు అవకాశం కల్పించక పోవడంతో ఎస్జీటీలో నిరాశకు గురయ్యారు. ఈ సందర్భంటా టీటీఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్‌చంద్రకాంత్ మాట్లాడుతూ ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులలో సెకండరీ, ప్రాథమిక ఉపాధ్యాయుల మధ్యలో విభేదాలు చేసి ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని ఎస్జీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఆయన వెంట గిరిజన ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకులు రాథోడ్‌గణేష్, రవీందర్‌జాదవ్‌లున్నారు.

నిర్మల్ జిల్లా నర్సాపూర్‌లో..

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 528 మంది పట్టభద్రులకు గాను 414 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 78.4 శాతం పోలింగ్ నమోదైంది. 57 మంది ఉపాధ్యాయులకు గాను 53 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 92.98 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. ఎస్సై సాయికిరణ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెంబిలో ..

పెంబి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 17 ఉపాధ్యాయ ఓటర్లకు గాను 16 మంది ఓటర్లు ఓటు వినియోగించుకున్నారు. పట్టభద్రులు 196 ఓట్లకు గాను 134 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పీవో రమేష్ తెలిపారు.

కుంటాల , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 614 మంది పట్టభద్రులుండగా, 483 ఓట్లు పోల్ అయ్యాయి.

బస్సుపై పడ్డ చెట్టు.. తప్పిన ప్రమాదం



చెట్టు పడటంతో పగిలిన బస్సు అద్దాలు

గుడిహత్నూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోషం గ్రామ సమీపంలోని పునగూడ వద్ద గురువారం సాయంత్రం బస్సుపై చెట్టు పడింది. స్థానికులు బస్సు డ్రైవర్, కండక్టర్ తెలిసిన వివరాల ప్రకారం ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు పునగూడా రాగానే రోడ్డు పక్కన ఉన్న ఎండిపోయిన భారీ చెట్టు ఒక్కసారి గాలి వీయడంతో బస్సుపై పడింది. దీంతో బస్సు ముందరి అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణీకుడికి స్వల్ప గాయాలయ్యాయి.



బస్సు పక్కకు తీయడంతో రోడ్డుపై చెట్టు

బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో పట్టభద్రులు,ఉపాధ్యాయులకు ఎలాంటి న్యాయం జరగలేదు : ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పదేండ్ల పాలన, కాంగ్రెస్ 14 నెలల పాలనతో ప్రజలు, పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఎటువంటి న్యాయం జరగలేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. డైట్ కళాశాలలో ఓటింగ్ జరుగుతున్న తీరును పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంటనే బీజేపీ నాయకులు లాలామున్న, వేదవ్యాస్, విజయ్, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో తమకు ఎలాంటి న్యాయం జరగలేదని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారానికి వెళ్లిన సందర్భంలో తెలపాలన్నారు. ఓటేసేందుకు ఉత్సాహంగా పట్టభద్రులు, ఉపాధ్యాయులు వస్తున్నారన్నారు. ప్రస్తుతం ట్రెండ్ చూస్తే బీజేపీకి అనుకూలంగా ఉందన్నారు. సమస్యలను ఆడగలన్న, అనుకున్నది సాధించాలన్న బీజేపీ అభ్యర్థులు శాసన మండలిలో ఉండాలని ఉపాధ్యాయులు, పట్టభద్రులు భావిస్తున్నారన్నారు.

కుంటాల జలపాతం వద్ద

కొనసాగుతున్న వైద్య శిబిరం

నేరడిగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాల జలపాతం వద్ద రెండవ రోజు గురువారం వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కుంటాల జలపాతం వద్ద వెలసిన సోమేశ్వరుడి ఆలయాన్ని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హెచ్ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య తదితరులు వైద్య సేవలు అందజేశారు.


పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రాజర్షిషా


గుడిహత్నూర్‌లో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్


ఓటు హక్కును వినియోగించుకున్న యువత


భీంపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న జేఏసీ విద్యావంతులు


బోథ్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



ప్రశాంతంగా ముగిసిన
ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్


పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్న గృహిణి


ఓటు హక్కును వినియోగించుకున్న ఉపాధ్యాయులు


ఇచ్చోడ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు




తలమడుగులో ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు


ఇచ్చోడలో పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన సర్కిల్ సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి


తలమడుగులో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై అంజమ్మ, పోలీసు అధికారులు

నేరడిగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగాయి. అర్హులైన పట్టభద్రులు ఉపాధ్యాయులు పెద్దల సభకు తమ ప్రతినిధిని ఎన్నుకునేందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేరడిగొండ మండల పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 643 ఉండగా 476 మంది ఓట్లు వేశారు. 74శాతం ఉపాధ్యాయ ఓటరు 53 ఉండగా 51 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96 శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంచి ఎన్నికలు సజావుగా జరిగేలా ఎస్సై శ్రీకాంత్, ఎంపీఈవో రాజేశ్వర్, తహసీల్దార్ కలీం, డీటీ మహేష్, ఎంఆర్ఐ నాగోరావులు పర్య వేక్షించారు.

● పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఎన్నికలు నాలుగు గంటలకు ముగిసింది. గుడిహత్నూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న విధానాన్ని ఎంత శాతం పోలింగ్ అయింది అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో ఎంత మంది పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉన్నారని తహసీల్దార్ కవిత రెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని సీఐ భీమేష్‌కు సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంద్రవెల్లి: పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం మండల కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, టీచర్స్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌తో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ఆదేశించారు. మండలంలో పట్టభద్రుల 342 ఉండగా 263 మంది, టీర్స్ 32 ఉండగా 31 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే పోలింగ్‌కు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

కలెక్టర్ హామీతో ఓటింగ్‌లో పాల్గొన్న జేఏసీ విద్యావంతులు

భీంపూర్: కరంజి (టి) రోడ్డు సమస్యను పరిష్కరించనిదే తాము ఎమ్మెల్సీ ఓటింగ్‌లో పాల్గొనబోమని రోడ్డు సాధన కమిటీ (జేఏసీ) ఎమ్మెల్సీ ఎన్నికను బహిష్కరించిన విషయం తెలిసిందే. అయితే ఉదయం పోలింగ్ ప్రారంభం అయినప్పటికీ మండల పట్టభద్రులు, టీచర్లు ఎవరూ తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. అంతకు ముందే సామాజిక మాధ్యమాల ద్వారా తమ చైతన్యాన్ని చాటారు. మధ్యాహ్నం అయినప్పటికీ విద్యావంతులు ఓటింగ్‌లో పాల్గొనలేక పోవ డంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ విష యమై స్పందించిన కలెక్టర్ రాజార్షిషా రోడ్డు సమస్య ను పరిష్కారానికి కృషి చేస్తానని సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ హామీ మేరకు జేఏసీ విద్యా వంతులు మధ్యాహ్నం నుంచి ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ సమయం ముగిసే సరికి 244 ఓట్లకు గాను 184 (75 శాతం) ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలో గురువారం జరి గిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇచ్చోడ మండలంలో మొత్తం పట్టభద్రులు 659కి గాను 465 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా టీచర్ ఓటర్లు 39కి గానూ 37 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో టీచర్ల ఓటింగ్ శాతం 94 శాతంగా నమోదైంది. బ్యాలెట్ ఓట్లు 7 నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో మహిళా ఓటర్లు 144, పురుష ఓటర్లు 321 మంది ఓటును వేశారు. టీచర్ల ఎన్నికల్లో 8మంది మహిళా ఓటర్లు కాగా, 29మంది పురుష ఓటర్లు తమ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని సర్కిల్ సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి సందర్శించి ఓటింగ్ సరళి వివ రాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద ఇ చ్చోడ సర్కిల్ సీఐ, ఎస్సై నేతృత్వంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం పూట మందకోడిగా సాగిన ఓ టింగ్ సరళి మధ్యాహ్నం 12 గంటల నుంచి పుంజుకుంది. దీతో మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

స్థానిక ఎన్నికలను మరిపించిన ఎమ్మెల్సీ ఎన్నికలు

బోథ్: మండల కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను మరిపించాయి. కొంత మంది ఉద్యోగులు తమ పిల్లలను తీసుకొని ఓటు వేసేందుకు రావడం కనిపించింది వికలాంగులు సైతం ఓట్లను వేశారు కాంగ్రెస్ బీజేపీ పట్టభద్రుల అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల వారు పోలింగ్ కేంద్రాలకు సమీపంలో టెంట్లు వేసుకుని కూర్చుని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొన్ని పార్టీల పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు జరిగాయి.

తలమడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 78 శాతం హక్కును వినియోగించుకున్నారు. 614 ఓటర్లకు గాను 478 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు తెలిపారు. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు గాను 25 మంది ఓటర్లకు గాను 23 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక ఏర్పాట్లను తహసీల్దార్ రాజమోహన్, ఎస్సై అంజమ్మలు ఏర్పాట్లు చేపట్టారు.


లింగోద్భవం వేళ ఓంకారేశ్వర స్వామికి స్వయంగా అభిషేకం చేస్తున్న భక్తులు


తర్లపాడ్ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


తర్లపాడ్ గ్రామంలో శివ పార్వతుల పల్లకీ ఊరేగింపు


కదిలిలో ఆది దంపతుల పల్లకీ సేవలో భక్తులు

వైభవంగా ముగిసిన మహా శివరాత్రి వేడుకలు

● తర్లపాడ్‌లో కన్నుల పండువగా శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం ● లింగోద్భవం వేల శివుడికి స్వయంగా అభిషేకం చేసేందుకు తరలివచ్చిన భక్తులు

ఖానాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదిన వేడుకలు గురువారం సైతం అత్యంత వైభవంగా సాగాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని మండలంలోని తర్లపాడ్ గ్రామంలో గల ఓంకారేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి పదిన్నర గంటల వరకు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన అనంతరం గ్రామంలో పల్లకి ఊరేగింపు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు ఆలయంలో లింగోద్భవం కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. లింగోద్భవం వేళ శివలింగానికి స్వయంగా అభిషేకం చేసేందుకు మండలంలోని పలు గ్రామాల నుండి భక్తులు ఓంకారేశ్వర స్వామి ఆలయానికి భారీగా తరలివచ్చారు. లింగోద్భవం వేళ భారీగా భక్తులు తరలిరావడంతో సుమారు గంటన్నర పాటు భక్తులచే స్వయం అభిషేకాలు నిర్వహించారు. జాగరణ చేసే భక్తులు తెల్లవారులు ఆలయ ప్రాంగణంలోనే గడిపారు. గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ పూజారి మామిడిపల్లి హరీష్ చారి, ఎలకంటి వెంకటాచార్యుల అధ్వరయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. తర్లపాడ్ ఓం కారేశ్వర స్వామి ఆలయంతో పాటు దిలావర్‌పూర్ రాజరాజేశ్వర స్వామి, మస్కాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కదిలిలో కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి కల్యాణం కనువిందుగా జరిగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కదిలిలో మూడు రోజులపాటు జాతర జరిగింది. బుధవారం అర్ధరాత్రి వేల మంది భక్తుల సమక్షంలో కళ్యాణోత్సవం నిర్వహించారు. అంతకుముందు రుద్రాభిషేకం, బిల్వార్చన, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల దర్శనం పూజలు చేశారు. పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా అలక, ఎదుర్కోలు, బుజ్జగింపులు లాంటి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి పాప హరేశ్వరుడు మాంగళ్యధారణ చేసే ఘట్టం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచింది.


శివ పార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పల్లకిని మోసేందుకు పోటీ పడ్డ భక్తులు

మహా శివరాత్రిని పురస్కరించుకుని ఉపవాసం ఉన్న భక్తులు గురువారం ఉదయం స్వామివారి సన్నిధిలోనే ఉపవాసం విరమించారు. కదిలి గ్రామానికి చెందిన పాపహరేశ్వర స్వామి భక్తుడు సీతారాం పటేల్ రెండు రోజులపాటు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వేల మంది భక్తులకు మంచి రుచికరమైన భోజనం పెట్టిన సీతారాం పటేల్‌ను పలువురు భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్ రావు పటేల్, డైరెక్టర్లు ర మేష్, దత్తు పటేల్, మారుతి రావు ప టేల్, భూమేష్, మా జీ చైర్మన్ భుజంగ్ రావు, ఈవో భూమయ్య, జూనియర్ అసిస్టెంట్ మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.






సూర్యాపూర్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

రసవత్తరంగా కుస్తీ పోటీలు

● పాల్గొన్న పలువురు ప్రముఖులు

కుంటాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండలంలో బుధవారం ప్రారంభం అయిన మహాశివరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. బుధవారం శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం, అభిషేకం నిర్వహించగా, రాత్రి జాగరణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో ఉపవాస దీక్షలు వదిలారు. సూర్యాపూర్ గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 400 మంది మల్లయోధులు పాల్గొన్నారు. మొదటి బహుమతిగా రూ. 6100, ద్వితీయ బహుమతిగా రూ.3000 గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు.






ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో పూజలు చేస్తున్న జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎమ్మెల్యే

భక్తిశ్రద్ధలతో ముథోల్ పశుపతినాథ్ శివాలయం జాతర

● భారీగా తరలివచ్చిన భక్తజనం ● ప్రత్యేక పూజలు నిర్వహించిన ముథోల్ ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ జానకీ

ముథోల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలోని పశుపతి నాథ్ శివాలయం జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. నిర్మల్ జిల్లా నుండే కాకుండా ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పశుపతినాథ్‌ని దర్శించుకున్నారు. మహా శివరాత్రిలో భాగంగా ప్రతి సంవత్సరం రెండు రోజులపాటు జాతర జరుగుతుంది. అలాగే గత వారం రోజుల నుంచి ఆలయంలో జరుగుతున్న అఖండ హరినామ సప్తాహం జాతర చివరి రోజే ముగియడంతో కోరిన కోరికలు తీర్చాలని భోళా శంకరుడిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో ఉదయమే వేద పండితులచే అభిషేకం, అనంతరం అన్నపూజ చేశారు. కోరిన కోరికలను తీర్చే ఇలవేల్పుగా ఇక్కడి ప్రాంత ప్రజల నమ్మకం. సుమారు 10 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్‌లు ముథోల్ పశుపతి నాథ్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. శివాలయంలో పూజలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు భక్తులకు ఇబ్బంది కలుగ కుండా సేవలు అందించారు. జాతరలో ప్రత్యేక ఆకర్షణగా రంగుల రాట్నాలు నిలిచాయి. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని ఎడ్‌బిడ్ శివాలయంలో శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.



ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.2 । కనిష్ఠం 19.4



నిర్మల్ జిల్లా వార్తలు

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

కడెం పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

కడెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కడెంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఓట్లు మొత్తం 691 కాగా 466 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఓటింగ్ శాతం 67 శాతంగా నమోదైంది. టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 28 కాగా 25 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా పోలింగ్



ఓటు వేస్తున్న మాజీ మంత్రి ఐకె రెడ్డి

» జిల్లాలో ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు » ఆశించిన రీతిలో ముందుకు రాని గ్రాడ్యుయేట్‌లు » భారీగా టీచర్‌ల పోలింగ్ శాతం » టీచర్లు 89.27 శాతం » గ్రాడ్యుయేట్‌లు 72. 59 శాతం పోలింగ్ » సాయంత్రం 4 గంటలు దాటిన కూడా క్యూ కట్టిన ఓటర్లు » వారికి ప్రత్యేకంగా అనుమతులు జారీ చేసిన అధికారులు » భారీగా పోలైన టీచర్ల ఓట్లు



మామడ పోలింగ్ కేంద్రంలో



కడెంలో పోలింగ్ కేంద్రం వద్ద కలెక్టర్

నిర్మల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4గంటలు దాటిన తరువాత కూడా కొనసాగింది. నిబంధనల ప్రకారం పోలింగ్ నాలుగు గంటల వరకు ముగియాల్సి ఉన్నప్పటికి అప్పటి వరకు కూడా ఓటర్లు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి ఉండడంతో అధికారులు వారికి ప్రత్యేకంగా అనుమతినిస్తూ సీరియల్ నంబర్‌లతో చిట్టీలు పంపిణీ చేశారు. సాయంత్రం 5గంటల వరకు కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్ని కలు జరిగాయి. అయితే మొత్తం జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గానూ 72.59 శాతం ఓట్లు పోల్ కాగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మాత్రం 89.27 శాతం ఓట్లు పోలయ్యాయి. అ. ధికారులు సాయంత్రం 4గంటల వరకు పూర్తయిన పోలింగ్ శాతాన్ని అధికారికంగా వెల్లడించినప్పటికి అదన పు సమయంలో మరిన్ని ఓట్లు పోలయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అయితే ఎన్నికలను సజావుగా జరిపేందుకు కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలలు ఉద యం నుంచి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును సమీక్షించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పలు పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సూచనలు జారీ చేశారు. అలాగే జిల్లాలోని 13 సమస్యాత్మక కేంద్రాల్లో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పర్యటించి అక్కడి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తూ జీపీఎస్ సిస్టంతో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని పోలింగ్ సరళీని జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్‌తో పరిశీలించారు. కాగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు వివిధ టీచర్ సంఘాల యూ నియన్‌లు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఓటర్లకు సహకరించారు. దీని కారణంగా జిల్లా కేంద్రమైన నిర్మల్‌తో పాటు ముథోల్, భైంసా, ఖానాపూర్ తదితర చోట్ల సాధారణ ఎన్నికల వాతావరణం కనిపించింది.

ఆశించిన రీతిలో ముందుకు రాని గ్రాడ్యుయేట్‌లు భారీగా పోలైన టీచర్ల ఓట్లు

కాగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు గ్రాడ్యుయేట్ ఓటర్లు పెద్దగా ఆసక్తి కనబర్చకపోవడం ఆసక్తికరంగా మారుతోంది. కాగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు పెద్ద సంఖ్యలోనే పోలింగ్‌కు హజరవ్వడంతో పోలింగ్ శాతం పెరిగింది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల 89.27శాతం ఓట్లు పోల్ కాగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 72.59శాతం ఓట్లు పోలయ్యాయి. అయితే అధికారికంగా ఈ ఓట్ల శాతం కొంత మేరకు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మొత్తం జిల్లాలో 17,141 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుండగా ఇందులో నుంచి 11,374 మంది గ్రాడ్యుయేట్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో నుంచి 7541 మంది పురుషులు, 3833 మంది మహిళ ఓటర్లున్నారు. అలాగే టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 1966 మంది ఉండగా ఇందులో నుంచి 1601 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1013 మంది పురుషులు, 588 మంది మహిళ టీచర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోటాపోటీగా కాంగ్రెస్, బీజేపీలు

కాగా గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ పార్టీలు సీరియస్‌గా తీసుకొని పోటాపోటీగా ఎన్నికల పర్వాన్ని కొనసాగించాయి. ముఖ్యంగా బీజేపీ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయగా కాంగ్రెస్ పార్టీ మాత్రం కేవలం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని మాత్రమే రంగంలోకి దించింది. అయితే మొదటి నుంచి ఈ రెండు పార్టీల అభ్యర్థులతో పాటు పలు టీచర్ల యూనియన్ అభ్యర్థులు గెలుపు కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. గతంలో ఎన్నడు లేని రీతిలో ఎమ్మెల్సీ అభ్యర్థులు చేసిన ప్రచార ప్రయత్నాలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. టీచర్లు, గ్రాడ్యుయేట్‌లను పలుచోట్ల ప్రలోభాలకు కూడా గురి చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ పార్టీ తరపున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డిలు పోటీ చేయగా, బీఎస్పీ పార్టీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ వీరిద్దరికి గట్టి పోటీని చ్చారంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్, బీజేపీలతో పాటు ప్రధాన టీచర్స్ సంఘాలు సాధారణ ఎన్నికలను మరిపించే రీతిలో ప్రచారం చేపట్టి ఎన్నికలను రక్తి కట్టించాయి.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మొదటి నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడమే కాకుండా ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగానికి సలహాలు, సూచనలు అందించారు. పోలింగ్‌స్టేషన్‌ల నుంచి మొదలుకొని అధికారులు, సిబ్బంది నియామకం, ఎన్నికల నిర్వహణ, తదితర ఏర్పాట్లపై కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అలాగే జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపట్టడమే కాకుండా పోలీసు అధికారులను ఆయా డివిజన్‌లకు కేటాయించి చర్యలు చేపట్టారు. దీని కారణంగా ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.



కుంటాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ



పెంబిలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు



ఖానాపూర్‌లో దివ్యాంగుడైన ఓటరుకు సహకరిస్తున్న ఎస్సై



ఓటు హక్కును వినియోగించుకునేందుకు భార్య సహాయంతో వచ్చిన ఉపాధ్యాయుడు



ఖానాపూర్ పోలింగ్ కేంద్రం సమీపంలో బీజేపీ నాయకులు

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య



ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న పాపన్న

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దిలావర్‌పూర్ మండలం కదిలిలో జరిగింది. దిలావర్‌పూర్ ఎస్సై లోక సందీప్ తెలిపిన వివరాల ప్రకారం... కదిలి గ్రామానికి చెందిన ధనుర్ పాపన్న(34) అనే యువకుడు గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. రెండు సంవత్సరాల క్రితం ప్రైవేట్ ఫైనాన్స్‌లో అప్పు చేసి ఆటో కొనుక్కుని సొంతంగా నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఫైనాన్స్‌లో నెల నెల వాయిదా చెల్లిస్తున్నాడు. కాగా గత కొంత కాలంగా పాపన్న మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగవద్దని భార్య ఎన్నిసార్లు చెప్పినప్పటికి వినిపించుకోకుండా తాగుతూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో పాపన్న ఆటోలో ఎక్కేందుకు ప్రయాణికులు భయపడుతుండటంతో రాబడి తగ్గింది. దీంతో కిస్తీ చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఏర్పడింది. మళ్లీ కిస్తీ చెల్లించేందుకు వాయిదా రావడంతో భార్య కిస్తీ చెల్లించేందుకు పాపన్నకు డబ్బులు ఇచ్చింది. అయితే ఆ డబ్బులు కిస్తీకి చెల్లించకుండా పాపన్న మద్యం తాగడంతో బుధవారం రాత్రి ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. గురువారం ఉదయం మరోసారి మద్యం తాగి అదే మత్తులో ఇంటికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు రక్షించేందుకు పరుగెత్తే లోగానే ప్రాణాలు వదిలాడు. మృతుడి భార్య గంగాసాగర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులున్నారు.

సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్లి(కే) గ్రామ కమిటీ ఎన్నిక



నర్సాపూర్(జి), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్(జి) మండలంలోని అర్లి(కే) గ్రామంలో గురువారం సమత ఫౌండేషన్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్,జనరల్ సెక్రటరీగా ఎల్లన్న, సెక్రటరీగా వినాయక్ రాజ్, కోశాధికారి ముఖేష్, సభ్యులుగా మధుకర్, కైలాష్, శ్రీనివాస్, రాజు, సిందే శ్రీకాంత్, సుధాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో అనిల్‌కుమార్‌తో పాటు సభ్యులు ముత్యం పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య స్వల్పవాగ్వాదం



తమను అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్ నాయకులు

• భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ జానకీ షర్మిల



అనుచరులతో పోలింగ్ కేంద్రానికి వెళుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. గురువారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ తన అనుచరులతో కలిసి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఒకేసారిగా ఇంత మందితో లోపలికి వెళ్లవద్దని పోలీసులు అభ్యంతర చెప్పారు. దీంతో తామంతా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు ఓటు హక్కు కలిగి ఉన్నామని తమను ఓటు వేయకుండా అడ్డుకోవడం సరికాదని జాన్సన్ నాయక్ అనుచరులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అధికార పక్షానికి మద్దతుగా నిలవడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఒక దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారుతున్న క్రమంలో బీఆర్ఎస్ నాయకులను ఓటు వేసేందుకు ఒక్కొక్కరుగా లోపలికి అనుమతించడంతో వివాదం సద్దుమణిగింది. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం సహా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖానాపూర్ మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 114 మంది ఓటర్లు ఉండగా ఇందులో 104 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 1,278 మంది ఓటర్లు ఉండగా 935 మంది పట్టభద్రులు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి భద్రతపరమైన ఇక్కట్లు తలెత్తకుండా ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేశారు.

ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఖానాపూర్ వచ్చినజిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఎస్పీ రాజేష్ మీనాలు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా గేటు వద్ద కనీసం నీడ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో పోలీసు సిబ్బంది ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండలోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి తలెత్తింది. పోలింగ్ కేంద్రం గేటు వద్ద కనీసం టెంట్ వేస్తే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు. పోలింగ్ కేంద్రం వద్ద వసతుల ఏర్పాట్లు సరిగా చేయకపోవడంపై మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న అధికారుల తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపించాయి. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో రోడ్డుకు ఇరువైపులా ఓవైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు టెంట్లు వేసుకొని మరీ ఎనినకల ప్రచారం నిర్వహించారు. వీరి ప్రచార సరళి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలను తలపించిందని ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ముథోల్‌లో పోలీసుల బందోబస్తు



ముథోల్‌లో పోలింగ్‌స్టేషన్ వద్ద ఎస్పీ, పోలీసు అధికారులు

ముథోల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటింగ్ 77.12 శాతం, టీచర్ ఎమ్మెల్సీ ఓటింగ్ 84.74 శాతం నమోదైనట్లు పీవో శ్రీకర్ తెలిపారు. ముథోల్ మండలంలోని 494 మంది పట్టభద్రులకు గాను 381 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే ఇందులో 275 మంది పురుషులు, 106 మహిళా పట్టభద్రులు ఓటు వేశారు. మొత్తం 77.12 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే ఎమ్మెల్సీ టీచర్ ఓటర్లు మొత్తం 118 ఉండగా అందులో 100 టీచర్స్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 67 మంది పురుషులు, 33 మంది మహిళలు తమ ఓటు వేశారు. అంటే 84.74 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాన్ని ఉదయం జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్‌లు సందర్శించి ఓటింగ్ సరళి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిలు ఓటరు సరళిని తమ తమ పార్టీ నాయకులకు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం పూట మందకోడిగా సాగిన ఓటింగ్ సరళి మధ్యాహ్నం 12 గంటల నుండి పుంజుకుంది.

వల చుట్టుకుని జాలరి మృతి

• రత్నాపూర్ కాండ్లిలో విషాదం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధినిచ్చి వృత్తే ఆ వ్యక్తి ఉసురు తీసింది. ఇంతకాలం బ్రతుకుదారి చూపి ఆదుకున్న గంగమ్మ తల్లి పొట్టన పెట్టుకుంది. చేపల వేటకు వెళ్లిన కొత్తూరు భోజన్న(59) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు వలకు చిక్కుకుని నీటమునిగి మృతిచెందిన సంఘటన రత్నాపూర్ కాండ్లిలో తీవ్ర విషాదం నింపింది. దిలావర్‌పూర్ ఎస్సై లోక సందీప్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామానికి చెందిన కొత్తూరు భోజన్న(59) గ్రామ సమీపంలో ఉన్న శ్రీరాం ప్రాజెక్టులో చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించే వాడు. ప్రతి రోజు లాగే గురువారం తెల్లవారు జామున చేపలు పట్టేందుకు శ్రీరాం ప్రాజెక్టుకు వెళ్లాడు. అప్పటికి ఇంకా మసక మసక గానే ఉంది. తెప్ప, వలతో సహా ప్రాజెక్టులోకి దిగాడు. తెప్పపై కూర్చుని వల విసిరే క్రమంలో ఆ వల కాస్త ఆయన కాళ్లపై పడి భోజన్నను నీటిలోకి తోసింది. ఈత కొట్టేందుకు ప్రయత్నించినప్పటికీ వల్ల కాళ్లకు చుట్టుకోవడం వల్ల అది సాధ్య పడకపోగా మరింత చుట్టుకుంది. దీంతో ప్రాణ భయంతో భోజన్న కేకలు వేశారు. ఆయనకు దూరంలో ఉన్న తోటి మత్స్యకారులు రక్షించేందుకు వచ్చే లోగానే భోజన్న నీట మునిగి మృతి చెందాడు. భోజన్నకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయి ఆ కుటుంబ సభ్యులు విలపించిన తీరు గ్రామస్థులను కంట తడి పెట్టించింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.



వల చుట్టుకుని మృతి చెందిన కొత్తూరు భోజన్న

ఒకే పోలింగ్ బూత్ కారణంగా ఓటర్ల అగచాట్లు

• అడిగితే కానీ అందుబాటులోకి రాని నీటి సౌకర్యం




లక్ష్మణచాందలో ఓటు వేయటం కోసం క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఒకే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కారణంగా పట్టభద్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ మండలంలో గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటు హక్కు ఉన్నవారు ఒకేసారి రెండు ఓట్లు వేసి రావటానికి సమయం ఎక్కువగా అయినందున ఈ ఇబ్బందులు తప్పలేదు. దాహం వేస్తుంది నీరు కావాలని అడిగితే తప్ప ఓటర్లకు నీటి సౌకర్యం కల్పించకపోవటంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్‌లు ఓటింగ్ సరళిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.ఈ పోలింగ్‌లో పురుషులతో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో 85 శాతం పోలింగ్

మండలంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 85 శాతం కాగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ 62 శాతం దాటింది. ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులు మొత్తం 39 కాగా, 32 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 639 కాగా, 398 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవటం విశేషం. చాలా మంది గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవటంలో అశ్రద్ధ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఓటు హక్కును వినియోగించుకోవటం మన బాధ్యత అని కూచాడి శ్రీహరిరావు అన్నారు.

శతాధిక వృద్ధుది మృతి



సాదుల లింబగిరి(ఫైల్)

కుంటాల , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలకు చెందిన సాదుల లింబగిరి(103) అనే శతాధిక వృద్ధుడు గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన గతంలో పట్వారిగా విధులు నిర్వహించారు. ఈయన మృతితో గురువారం మండల కేంద్రంలో కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు.

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

నిర్మల్ - 99854 03060

భైంసా - 81258 56776

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11454

బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451